ఎంపికనే కీలకం

- నకిలీ కంపెనీల ప్రకటనలతో మోసపోవద్దు
- గుర్తింపు, నాణ్యత కలిగిన విత్తనాలే మేలు
- వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

చేవెళ్లటౌన్, జూన్ 10 : ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే సమయం అసన్నమైంది. ఈ సమయంలో పలు రకాల కంపెనీలు విత్తనాలు, పురుగుల మందుల ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నాయి. ఇలాంటి సమయంలో రైతులు మోసపోకుండా నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు వివరిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కొన్ని ప్రైవేటు కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార అర్భాటాలతో రైతులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాయి. రైతులు అప్రమత్తతతో ఒకటికి రెండుసార్లు ఆలోచించి గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి. ప్రతి సంవత్సరం నకిలీ విత్తనాల కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా కొత్త కంపెనీలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. నేల స్వభావాన్ని బట్టి పైరు ఎదుగుదల, చీడ పీడల ఉధృతి ఉంటుంది. భూసార పరీక్షలు చేసుకుని ఎరువులు, పురుగుల మందులు వాడటం ఉత్తమం. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తే మంచిది.

చేవెళ్ల ఫెర్టిలైజర్ దుకాణంలో రిజిస్టర్‌లను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కిష్టయ్య, ఏవో తులసి


విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు

వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం ఉత్తమం. గడువు దాటిన విత్తనాలు, వదులుగా ఉన్న ప్యాకెట్లు, చిరిగిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి వచ్చే ప్యాకెట్లను కొనుగోలు చేయవద్దు. బిల్లులపై విక్రయదారుడి పేరు, సంతకం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్ను నంబర్లు, తేదీ, రకం, పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీ, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి. రైతులు కొనుగోలు చేసిన సరుకును డీలరు వద్ద తూకం చేయించాలి.

పురుగుల మందు ఎంపికలో..

పంటలకు చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు రైతులు ఏదో ఒక రకం మందులు పిచికారీ చేస్తుంటారు. అలా కాకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచన మేరకు పురుగుల మందులు కొనుగోలు చేయాలి. వాటిని పిచికారీ చేసే సమయంలో తగిన మోతాదులో నీటిలో కలపాలి.

వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలి

రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. దళారులను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలి. గ్రామాల్లోకి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి విత్తనాలు అమ్మితే అస్సలు కొనుగోలు చేయవద్దు. అలాంటి వారిపై వ్యవసాయాధికారులకు సమాచారమందించాలి. మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకుని అధిక దిగుబడులు సాధించాలి.

- రమాదేవి, చేవెళ్ల డివిజన్ ఏడీఏ

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అదనపు బస్సులు నడపాలి

కడ్తాల్, జూన్ 10 : చరికొండకు అదనపు బస్సులు నడపాలని కోరుతూ సోమవారం గ్రామానికి చెందిన పలువురు నాయకులు హైదరాబాద్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండల పరిధిలోని చరికొండ గ్రామానికి సరిపడా బస్సుల నడపకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కల్వకుర్తి నుంచి ఆమనగల్లు, కర్కల్‌పహాడ్, ఏక్వాయిపల్లి, చరికొండ గ్రామాల మీదుగా యాచారం వరకు, మాల్ నుంచి కొల్కులపల్లి, నాగిళ్ల, చరికొండ గ్రామాల మీదుగా కల్వకుర్తికి రెండు బస్సులను నడపాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. బస్సు సౌకర్యం కల్పించేందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. వినతిపత్రం అందించినవారిలో ఎంపీటీసీ రాములుగౌడ్, స్థానిక నాయకులు ఉన్నారు.

గత వారం రోజులుగా అమెరికా పర్యటనలో ఉన్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సోమవారం అమెరికా అట్లాంటా జార్జ్ వరల్డ్ కాంగ్రెస్ సెంటర్ కమిటీ హాల్‌లో జరిగిన అమెరికా తెలుగు అసోసియేషన్ వారి 18వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
- షాబాద్, జూన్ 10

రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు (టెస్కాబ్) వైస్ చైర్మన్‌గా రంగారెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోమవారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సత్తయ్యను సన్మానించారు.
- తుర్కయాంజాల్, జూన్ 10

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌లో ఉపాధ్యాయులకు విద్యార్థుల యునిఫామ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్/షాద్‌నగర్‌రూరల్, జూన్ 10 : అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం షాద్‌నగర్‌లోని ఎంఈవో కార్యాలయం ఆవరణలో విద్యార్థుల యునిఫామ్‌లను ఆయా పాఠశాలల ప్రభుత్వ ఉపాధ్యాయులకు అంజేసిన సందర్భంగా మాట్లాడారు. పేద విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా విద్యా శాఖను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో పాఠాలను బోధిస్తున్నారని, ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రహించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో వేల రూపాయలను వెచ్చించే బదులు సర్కారు బడుల్లో తమ పిల్లలను చేర్చించాలని చెప్పారు. కాలానికి అనుగుణంగా అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమంలో బోధన కొనసాగుతున్నదని, పాఠశాలల నిర్వహణ సజావుగా జరుగుతున్నదన్నారు. ఒక్కో మండలానికి వేల సంఖ్యలో యూనిఫామ్‌లు అవసరమున్నాయని, రెండు, మూడు విడతల్లో అన్ని తరగతుల విద్యార్థులకు దుస్తులు అందుతాయని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు ఉపాధి చూపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం యూనిఫామ్ స్టిచింగ్‌ను ఆయా మహిళా సంఘాలకు అప్పగించడం సంతోషకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్‌రాథోడ్, ఉపాధ్యాయులు, నాయకులున్నారు.

బొడ్రాయి వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

దైవ చింతన అలవర్చుకోవాలి

ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

నందిగామ, జూన్ 10 : ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. నందిగామ మండలం మొదళ్లగూడ గ్రామంలో సోమవారం బొడ్రాయి పండుగ వార్షికోత్సవం గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఉమ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మైసమ్మ, పోచమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు పండి రైతులు, ప్రజలు సంతోషంగా జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని, శాసనమండలిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమస్యలపై ప్రశ్నిస్తానని తెలిపారు.

సహారా కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, జూన్ 10 : సహారా స్టేట్స్ కాలనీలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల నూతనంగా ఎన్నుకోబడిన మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారా స్టేట్స్ కాలనీ మెయింటెనెన్స్ కమిటీ కార్యవర్గసభ్యులు సోమవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నూతనంగా ఎన్నికైన వెంకటాద్రి ప్యానెల్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణంతోపాటు బహార్ పదవ బ్లాక్ వద్ద తరచూ తలెత్తుతున్న వరద ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని అధ్యక్షుడు సయ్యద్ జానీ ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే కాలనీలో సుమారు కోటి రూపాయలతో ప్రధాన రహదారుల్లో సీసీ రోడ్లు వేయడం జరిగిందని తెలిపారు. కాలనీలో మిగిలిపోయిన అంతర్గత రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సయ్యద్ జానీ, ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మేకల ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరావు, కోశాధికారి శేఖరయ్య, సంయుక్త కార్యదర్శులు భీమానాయక్, ఆర్.మంజుల పాల్గొన్నారు.

అభివృద్ధిని పనులను వేగవంతం చేయాలి

అధికారుల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే రంగారెడ్డి

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, జూన్ 10 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి పనులతో పాటు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారిలోని శేరిగూడ సమీపంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులపై ఆయన అధికారులతో చర్చించారు. బ్రిడ్జి నిర్మాణంలో జరుగుతున్న జాప్యం వంటి వాటిని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వంతెన నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వపరంగా అవసరమైన సహకారాన్ని అందించడానికి కృషిచేస్తానని తెలిపారు.

వ్యవసాయ పనులు ప్రారంభమవుతున్నందున రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని నకిలీ విత్తనాలు విక్రయించినట్లయితే అలాంటివారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, విద్యుత్ కోతలు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో రోడ్లు, ఇతరత్రా మౌలిక సదుపాయాలు కల్పించాలని, అందుకనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, పెద్దఅంబర్‌పేట్, తుర్కయాంజాల్ మున్సిపాలిటీల్లో విస్తరిస్తున్న కాలనీల్లో ప్రజల అవసరాలను తీర్చడానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులతో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందుకెళ్లాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఈదుల చెరువు పరిశీలన

పెద్దఅంబర్‌పేట, జూన్ 10 : పెద్దఅంబర్‌పేటలోని ఈదుల చెరువులో చేపడుతున్న నిర్మాణాలపై అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. చెరువులో కల్వర్టు నిర్మించడంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్, ఇరిగేషన్ డీఈ ఉషారాణి, ఏఈఈ తస్వీన్ రజా, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి తదితరులు చెరువును పరిశీలించారు. కొంత వరకు నిర్మించిన కల్వర్టును తొలగిస్తామని అధికారులు తెలిపారు.

బిల్ కలెక్టర్లను రెగ్యులరైజ్ చేయండి

పెద్దఅంబర్‌పేట, జూన్ 10 : పది నుంచి 25 ఏండ్లుగా బిల్ కలెక్టర్లుగా పని చేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ బిల్ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముత్తడి మల్లారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం సంఘం ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏండ్లుగా గ్రామపంచాయతీల్లో ఫిక్స్ డే పే వేతనంతో బిల్ కలెక్టర్‌లుగా పనిచేశామని తెలిపారు. పదేండ్ల కిందట ఆయా గ్రామ పంచాయతీలను ప్రభుత్వం మున్సిపాలిటీలుగా మార్చిందన్నారు. ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పిస్తుందన్న నమ్మకంతో చాలీచాలని జీతాలు ఉన్నా కంప్యూటర్ ఆపరేటర్లుగానూ పని చేస్తున్నామని తెలిపారు. తమ కుటుంబాలు రోడ్డున పడకముందే ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కృష్ణ, నవరతన్‌రెడ్డి, అంజలి పాల్గొన్నారు.


2006-07 సంవత్సరంలో ఊరెళ్ల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు కలుసుకున్నారు. సోమవారం మండల పరిధిలోని రామన్నగూడ గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకుని తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించి పాత తీపి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.
- చేవెళ్ల రూరల్, జూన్ 10

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి
షాబాద్ మండల ఏవో వెంకటేశం

కొత్తూరు, జూన్ 10 : రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఎంపీపీ విద్య, వ్యవసాయ, విద్యుత్ అధికారులతో ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మట్లాడుతూ.. విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. నూతన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు సమకూర్చాలని తెలిపారు. విత్తనాలు, ఎరువుల నకిలీల బెడదను అరికట్టాలని పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నందున పాఠశాలల్లో వసతులు, పుస్తకాలు, యునిఫామ్ తదితరాలు విద్యార్థులకు అందించాలన్నారు. రైతులు, విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తవద్దని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతి, ఎలక్ట్రికల్ ఏఈ సాయికృష్ణ, మండల వ్యవసాయ అధికారి గోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొత్తూరు : సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొరత రాకుండా చూడాలి

షాబాద్ : రైతులకు ఎరువులు, విత్తనాల కొరత రాకుండా స్టాక్ అందుబాటులో ఉంచాలని షాబాద్ మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం అన్నారు. సోమవారం షాబాద్‌లోని పలు ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రైతుకు బిల్లు ఇవ్వాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై తగిన చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీలర్లు ఉన్నారు.

షాబాద్ : ఫెర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖాధికారి వెంకటేశం

నేడు పంటల సాగుపై అవగాహన సదస్సు

షాద్‌నగర్, జూన్ 10 : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వానకాలం పంటల సాగుపై మంగళవారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి నిషాంత్ సోమవారం తెలిపారు. షాద్‌నగర్‌లోని ఎల్ఎన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు., విత్తనాలు, ఎరువుల విక్రయదారులు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సుకు షాద్‌నగర్ ప్రాంత రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

ఆమనగల్లు మండల విద్యాధికారి సర్దార్‌నాయక్
ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి

బడిబాటలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 10 : బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి అన్నారు. మున్సిపాలిటీలోని ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి బడీడుకు రాగానే బడిలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని స్రవంతి సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు అజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి అవగాహన

ఆమనగల్లు : బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని మండల విద్యాధికారి సర్దార్‌నాయక్ అన్నారు. సోమవారం ఆమనగల్లులోని బాలికల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం, సీఆర్పీలతో కలిసి గుర్రంగుట్ట కాలనీలో ఆయన బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి బడీడు చిన్నారులను పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏంఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్య, అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని ఎంఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష, సీఆర్పీ అహ్మద్ పాల్గొన్నారు.

నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


మున్సిపల్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మున్సిపల్ పాలకవర్గం

శంషాబాద్ రూరల్, జూన్ 10 : నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ సుష్మ, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, కమిషనర్ సుమన్‌రావులతో కలిసి మున్సిపల్ నూతన భవన నిర్మాణ పనులు,14వ వార్డు ఇంద్రారెడ్డినగర్ కాలనీలో మినీ ఫంక్షన్‌హాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శంషాబాద్ మున్సిపాలిటీలో కార్యాలయం లేకపోవడంతో నూతన భవన నిర్మాణం చేయడానికి నిధులు కేటాయించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

నూతన భవన నిర్మాణ పనులు 90 శాతం పూర్తయినట్లు వివరించారు. మిగతా పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. 14వ వార్డులోని ఇంద్రారెడ్డినగర్ కాలనీలో మినీ ఫంక్షన్‌హాల్ పనులను పరిశీలించినట్లు తెలిపారు. రెండు నిర్మాణాల్లో నాణ్యత పాటించి నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేసేలా మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు.

శంషాబాద్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం దాదాపు పూర్తి చేశామన్నారు. ప్రజలకు ప్రతి రోజూ తాగునీరందించి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. పనులు పరిశీలించిన వారిలో కౌన్సిలర్లు జహంగీర్‌ఖాన్, వెంకటేశ్, కుమార్, భారతమ్మ, రేఖాగుప్తా, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపల్ అధికారులున్నారు.

శివప్రకాశ్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కోశాధికారిగా శివప్రకాశ్

ఎల్బీనగర్, జూన్ 10 : రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కోశాధికారిగా ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన శివప్రకాశ్ నియమితులయ్యారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న శివప్రకాష్‌ను రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారిగా నియమిస్తూ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జగన్మోహన్‌రావు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివప్రకాశ్ మాట్లాడుతూ.. హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధికి, అసోసియేషన్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

14 వరకు ఐటీఐలో అడ్మిషన్లు

షాద్‌నగర్, జూన్ 10 : ఐటీఐ కళాశాలలో ప్రవేశాలను పొందేందుకు ఈ నెల 14 వరకు అవకాశం ఉందని ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు తమ పూర్తి వివరాలు, అర్హత ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని సూచించారు. పూర్తి వివరాలకు ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆమనగల్లులో ఇంటింటికీ వెళ్లి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఏంఈవో సర్దార్‌నాయక్